# ఎంతెంత దూరం?

-అరుంధతీ ఆచార్య

రమ్య
"అమ్మాయి పుడుతుందేమో, పెంచూ" అన్నాను.

"ఏం పెట్టి పెంచను? సంజయ్, సందీప్‌లకే నా సేవింగ్సన్నీ ఖర్చయిపోయాయి. ఇప్పుడు సంపాదించే శక్తి కూడా తగ్గిపోయింది. ఎలా?" అంది శార్వరి. "సమాజంలో ఎలా నెగ్గుకు వస్తుంది?" అంది మళ్లీ, నిస్పృహతో.

"హోటల్లో వెయిట్రెస్ అయి బతుకుతుందిలే", అన్నాను కాస్త కోపంతో.

"ఎందుకే అలాంటి మాటలు రమ్యా! అసలింతకీ అమ్మాయే పుడుతుందని ఎలా నిర్ధారణగా చెప్పగలను? మళ్లీ మగపిల్లాడు పుడితే వీళ్లిద్దరూ బతకనిస్తారా చెప్పు? ఎబార్షనే చేయించేసుకుంటాను. ఎలా జరుగుతే అలా జరుగుతుంది" శార్వరి ముఖం మీద నిస్సహాయత స్పష్టంగా కదలాడింది.

వెళ్లి సోఫాలో పక్కన కూచుని, శార్వరి భుజం చుట్టూ చెయ్యేసి, దాని ముఖం నా వైపుకి తిప్పుకుని అనునయంగా అన్నాను, "అవి నా మాటలు కావే. సమీర్ అన్నవే. తనని నువ్వు విడిచి వెళ్లిపోతున్నప్పుడు, 'నీ గతి అంతే', అన్నాడు నా దగ్గరకొచ్చి. నాకు బాధ కలిగిన మాట నిజమే. కాని అతని కోపం వెనుకనున్న వ్యాకులత అలా అనిపించిందేమో అతనిచేత. తన అండ లేకపోతే బయట సమాజంలో మగవారంతా నీకేం హాని కలుగజేస్తారో అన్న భయం కావచ్చు. భర్త నుంచి విడిపోయి ఒంటరిపోరాటం సాగించే స్త్రీలని మగ జాతి ఆమోదించే స్థితికి ఇంకా రాలేదు, శారూ. సమీర్ ఈజ్ ప్రాక్టికల్."

"ఈ ప్రాక్టికల్ దృక్పథం కేబరే డాన్సర్ల దగ్గర ఏమయిందిట? వాళ్లు పాపం పొట్ట గడుపుకోడానికే నైట్ క్లబ్బుల నాశ్రయిస్తున్నారని సమీరే చెప్పాడు. పైగా వాళ్లు ఒట్టి డాన్సులే చేస్తారనీ, ఇంకే విధమైన సంబంధాలూ పెట్టుకోరనీ కూడా చెప్పాడు. అవన్నీ నేను నమ్మిన తర్వాత, మామిడితోట అమ్మిన డబ్బు లక్ష రూపాయలూ, అమ్మ నా పేరన వేయమంటే, ఏదో సాకు చెప్పి, తన పేరున వేసేసుకుని, అదంతా ఆ విదేశాల నుంచి వచ్చిన డాన్సర్లని ఒబెరాయ్ హోటల్లో వుంచడానికి ఖర్చు చేసేశాడు. సమాజ సేవ చేయడానికి ఇంకెవరూ లేరా, ఈ ప్రపంచంలో, దిగంబర నృత్య కళాకారిణులు తప్ప? నాన్న పోయాక అమ్మని మా దగ్గరే వుండమంటే, ఆవిడ ఎంత సంబరపడిపోయిందో, అల్లుడిలో కొడుకుని చూసుకుని! అలాంటిది అమ్మ కూడా వజ్రాల సెట్ కొనుక్కో తోటమ్మిన డబ్బుతో, అన్నప్పుడు, ఏదో బిజినెస్‌లో నష్టం వచ్చిందీ, అదీ, ఇదీ అని నీళ్లు నమిలాడు. సమీర్ పార్ట్‌నర్ రాజ్ వాళ్లింట్లో పార్టీలో నన్ను పక్కకి పిల్చి చెప్పేదాకా నాకూ తెలియదు, నా మామిడి తోట విదేశాల్లో కాస్తోందని, ఏదైనా భరించొచ్చు, కానీ డిఫీట్ భరించ లేం. ఇంకా నా మనసులోంచి ఆ విషయం పోలేదు. పోదు కూడా

శార్వరి స్వరంలో వేదన వినలేక పోయాను. "ఎనిమిదేళ్లు దాటింది శారూ, నువ్వు విడిపోయి. ఇన్నేళ్లూ మీరిద్దరూ కలుసుకోనేలేదు. నువ్వీలోగా మీ ప్రాపర్టీస్ అమ్మిన డబ్బుతో ఎలాగో మగపిల్లల్ని పోషిస్తున్నావు. పైగా యాడ్ ఏజన్సీలో జాబ్ కూడా చేస్తున్నావు. మీ బాస్ ప్రభుకి నువ్వంటే బాగా ఇష్టం. ఎంతో ఫ్లెక్సిబుల్‌గా వుంటాడు, టైమింగ్స్ విషయంలో నీ దగ్గర. సంజయ్‌ని కూడా ఎబ్సార్బ్ చేసుకుంటానన్నాడని నువ్వు చెప్పావు. వాడికెంత వయసిప్పుడు? పందొమ్మిది వెళ్లినట్లుంది మొన్న ఆగస్ట్‌లో? సందీప్‌కి ఎంత? పన్నెండా? మా ఉదయ్ ఈడు వాడే ననుకుంటాను. అయినా మరీ అంత గ్యాపేమిటే? ఏడేళ్లకోసారేనా నీకు ప్రెగ్నెన్సీ వచ్చేదీ?" అన్నాను, వర్తమానం గతంతో కలిపేస్తూ. శార్వరి ఎక్స్‌ప్రెషన్ చూసి ఆగిపోయాను. శార్వరి మౌనంగా కూర్చుంది.

"సరేలే, ఇప్పుడవన్నీ ఎందుక్కానీ, సమీర్ పిల్లల్ని కలవడానికి ఎప్పుడు వస్తానన్నాడు?" అన్నాను, కొంచెం సద్దుకుని.

"ఇవాళ సాయంత్రం, తాజ్‌లో దిగాడు. పిల్లల్ని అక్కడికే తీసికెళ్తాడుట. ఉదయ్‌నీ, కిరణ్మయినీ కూడా రమ్మన్నాడు, రెండు రోజులు పిల్లలంతా సరదాగా కలిసి వుంటారని," అంది శార్వరి నిర్లిప్తంగా.

"మూణ్ణెల్ల క్రితం వచ్చినపుడు ఇక్కడే వున్నాడుగా. ఈసారీ ఇక్కడే దిగమను. తాజ్‌లూ అవీ ఎందుకు, డబ్బు దండగ" అంటూ, శార్వరి ముఖం చూసి ఆగి

పోయాను, 'అసందర్భపు ప్రేలాపన ఎక్కువే నీకు రమ్యా' అని కూడా అనుకున్నాను.

"క్రిందటిసారి నువ్వూ, సునీల్ గోవా వెళ్లారని బెడ్ రూంలు ఖాళీగా వున్నాయి. సాధ్యపడింది. ఇప్పుడు ఎకామడేట్ చేయలేవు, అందర్నీ. ఇలాగే అవనీ. ఈ విధంగానైనా డబ్బు సద్వినియోగపడినట్లవుతుంది' అంది శార్వరి.

"అవునులే. అస్తమానం క్విజ్ ప్రోగ్రాముల్లో గోవా ట్రిప్పులు గెల్చుకోలేంగా," అన్నాను.

ఆమధ్య సునీల్ తన మేధస్సుతో క్విజ్‌లో గెల్చి, కపుల్‌కి గోవా ట్రిప్, స్టే, అన్నీ సంపాదించి పెట్టాడు. శార్వరి కొడుకుల్ని తీసుకుని బెంగుళూరు వచ్చి, మా యింట్లో వుండి, పిల్లల్ని చూసుకోబట్టి, మేమిద్దరం ప్రైజ్‌ని వుపయోగించుకోగలిగాం. సమీర్ కూడా మా యింట్లో ఎడ్జస్ట్ అయిపోయి, ఉన్న నాలుగు రోజులూ కిరణ్మయికి అడిగిందీ, అడగందీ, నానా చెత్తా, బొమ్మలూ అవీ కొనిచ్చి, దాన్ని పూర్తిగా మాట వినకుండా తయారు చేసాడు. దానికింకా ఎనిమిదేళ్లు నిండకపోయినా, మా గృహ సామ్రాజ్యాన్ని విక్టోరియా మహారాణిలా పాలించేస్తోంది. ఏ అడ్డూ లేకుండా. ఇప్పుడిప్పుడే సునీల్ దాన్నో దారిలో పెడుతున్నాడు. సమీర్‌ని చూస్తే అది మళ్లీ విజృంభించేస్తుందేమో! అయినా, రెండు రోజులు తాజ్‌లో వుండి స్విమ్మింగ్ చేసినంత మాత్రాన ఏం చెడిపోతుందిలే, అని సమాధానపడిపోయాను.

గత రెండేళ్లుగా విజిటింగ్ రైట్స్ ఉపయోగించుకుంటున్న సమీర్, ప్రతిసారీ హైదరాబాదు వెళ్లి కొడుకుల్ని చూసి వస్తున్నాడు. ఈసారి మూణ్ణెల్లకే, 'బెంగుళూరులో పనిపడి వస్తున్నాను, పిల్లల్ని తీసుకుని రాగలవా', అని శార్వరికి కబురంపాడు. ఆవిధంగా శార్వరి తిరిగి వెంటనే రావల్సి వచ్చింది. వస్తూనే నాకో జీర్ణించుకోలేని వార్త చెప్పింది, 'ఐ ఏమ్ ప్రెగ్నెంట్' అని. కాసేపు నాకు మాట రాలేదు. ఆతర్వాత, మనసులో ఏవో గుణకారాలు వేసుకుని, 'మూణ్ణెల్లా?' అనడిగాను. తలూపింది, కళ్లు దించుకుని, కాసేపు ఇద్దరం మౌనంగా వుండిపోయాం. అప్పుడంది, "ఎబార్షన్ చేయించేసుకుంటాను. నాకు కాస్త సాయంగా వుంటావా? బెంగుళూరు అయితే స్కాండల్ వుండదు" అని.

"స్కాండలేమిటే? మీరిద్దరూ విడిపోయారే కానీ, విడాకులు తీసుకోలేదే?" అన్నాను కొంచెం కలవరంగా.

"ఆర్నెల్లయింది, విడాకులు మంజూరయి", అంది శార్వరి నిస్తేజంగా.

"అవన్నీ ఎవరు పట్టించుకుంటారుట, ఈరోజుల్లో? మళ్లీ కలిసిపోయారని సంతోషిస్తారు. అసలు కోర్టుల్లో కూడా రెండేళ్లు గడిస్తేనే కానీ విడాకులివ్వరు. దగ్గరవ డానికి ఛాన్సిస్తారు," అన్నా, నాకున్న లీగల్ పరిజ్ఞానం కాస్త వుపయోగించి.

"ఏడేళ్లు కలవకుండా వున్న తర్వాతనా?" అంది శార్వరి. చిన్న చిరునవ్వు దాని ముఖం మీద కనిపించే సరికి, నాకు ప్రోత్సాహం లభించినట్లయి, "ఈ లెక్కలన్నీ నాకర్థం కావే శారూ, నీ సమస్యేమిటో విపులంగా చెప్పు," అన్నాను, కొంచెం చిరాగ్గానూ, అనునయం గానూ.

"ప్రెగ్నెన్సీ కన్‌ఫర్మ్ అయేటప్పటికి ఎబార్షన్ చేయించుకునే సమయం దాటిపోయింది. ఇప్పుడు చేయించుకుంటే రిస్కు ఎక్కువ అంది డాక్టరు," మళ్లీ శార్వరి మౌనంగా వుండిపోయింది.

"అయితే చేయించుకోకూ, అమ్మాయి పుడుతుందేమో, పెంచూ," అన్నాను.

**శార్వరి**

అవగాహన కాస్త తక్కువ కానీ, రమ్య నాకున్న స్నేహితుల్లో అత్యంత సన్నిహితురాలు అని చెప్పుకోదగింది. అయోమయం ప్రశ్నలు వేస్తుంది, కానీ సలహాలు ఇవ్వదు. నా పరిస్థితి కనుగుణంగా ఏ నిర్ణయం తీసుకున్నా సహకరిస్తుంది. తప్పుపట్టదు. న్యాయ నిర్ణేతగా వ్యవహరించదు. మెదడు పిచిక ప్రమాణమూ, హృదయం బ్రహ్మాండమూనూ.

రమ్య అన్న మాటలకి గతమంతా ఒకసారి గుర్తుకి వచ్చింది.

సందీప్‌కి నాలుగో యేడు నడుస్తోంది అప్పుడు. రాజ్ ఆడంబరంగా ఇచ్చిన పార్టీ నుంచి ఇంటికి రాగానే, నైట్ గౌన్ తీసుకుని, బాత్రూంలోకి నడిచాను. సమీర్ తలుపు తీసుకుని లోపలికి రాబోయి, గడియ పెట్టి వుండడం చూసి, బైట నుండి అరవడం మొదలెట్టాడు. కాస్త డోసు ఎక్కువయిందేమో, మాటలు తడబడు తున్నాయి. తలుపుతీసి, తిన్న పక్కెక్కి ముసుగు తన్ని పడుకున్నాను. సమీర్ కాసేపయాక వచ్చి, లైటార్పి, మీద చేయి వేసాడు. మృదువుగా చెయ్యితీసి పక్కన పెట్టి, లేచి, కిందకి కిచెన్‌లోకి వెళ్లి, ఫ్రిజ్‌లో నీళ్లు తీసుకుని తాగి, కాసేపు గడియలూ అవీ

సరిగా వున్నాయో లేదో చూస్తున్నట్టు అక్కడే తచ్చాడి, మెల్లిగా మెట్లెక్కి పైకి వచ్చాను. సమీర్ గుర్రు పెట్టి నిద్ర పోతున్నాడు. ఇటు తిరిగి, మంచం చివరికి జరిగి కళ్లు మూసుకున్నాను. ఎప్పుడో మధ్య రాత్రి నిద్ర పట్టింది. కల్లో అంతా కేబరే డాన్సర్లే. వాళ్ల మధ్య కృష్ణుడిలా సమీర్!

పొద్దున్న లేవగానే, పక్కన సమీర్ లేడు. కిందకెళ్లే సరికి డైనింగ్ టేబిల్ దగ్గర కరాఫే లోంచి బ్లాక్ కాఫీ వంచుకుని తాగుతున్నాడు. నన్ను చూసి, "బ్లాక్ ఆర్ ఆ లే (au laif)" అన్నాడు. ఏమీ జవాబు చెప్పాలనిపించ లేదు. నేనూ కప్పు తెచ్చుకుని, బ్లాక్ కాఫీ పోసుకుని, టేబిల్‌కి ఆ చివర్న కూచున్నాను. "నువ్వు నా భార్యవి. పక్కనే కూచోవచ్చు," అన్నాడు. పేలవంగా ఒక నవ్వు నవ్వి, కిచెన్‌లోకి నడిచాను. రొటీన్ పన్లు చేస్తున్నానే కానీ మనసులో ఏదో తెలియని బాధ తొలిచేయడం మొదలెట్టింది. ఎలా ఇతన్ని ఏక్సెప్ట్ చేయడం? ఎందు కిలాంటి విషయాలు ఇంత తేలిగ్గా తీసుకుంటాడు? వివాహ వ్యవస్థని ఎందుకు గౌరవించడు? ఇటువంటి ఆలోచనలతోనే మూడు నాలుగు రోజులు మథన పడుతూ, సమీర్‌ని దూరంగా వుంచుతూ వచ్చాను. సమీర్‌కి నాకెందుకో కోపం వచ్చిందని అర్థమయింది. ఏవో ప్రయత్నాలు చేసాడు, నవ్వించాలని. కానీ నాకు కలిగింది కోపం కాదు. మోసపోయాననే ఒక క్షోభ. అది తీర్చగలిగే మానసిక పరిపక్వత అతనికి లేదు. వుంటే ఇలా చేయగలిగేవాడా?

నెల రోజులు మావయ్య దగ్గర గడపడానికి వెళ్లిన అమ్మ తిరిగి రాలేదు. బ్రెయిన్ హెమరేజ్ అయి అక్కడే పోయింది. సందీప్‌ని తీసుకుని వెళ్లిన నేనూ తిరిగి సమీర్ దగ్గరకి వెళ్లలేదు. అక్కడ నుంచే ఫోన్ చేసి, విడిపోతున్నానని చెప్పాను. "ఫూలిష్‌గా బిహేవ్ చేయకు శారూ. ఇప్పుడేం జరిగిందనీ?" అంటున్న సమీర్ స్వరంలోని బాధ ఒక పక్క వినిపిస్తున్నా, ఇంకోపక్క నాకు కలిగిన బాధతో పోలిస్తే అదెంతనిపించింది. నా మనసేం కరగలేదు. ఆస్తి వ్యవహారాలూ అవీ మావయ్యతో సంప్రదించి, తేల్చుకున్నాక, హైదరాబాదు లోనే ఉద్యోగ ప్రయత్నాలు ఫలించి, వుండిపోయాను. సమీర్‌కీ నాకూ కలిగిన దూరం కూడా అలాగే వుండిపోయింది.

సంజయ్ టెన్త్ అయేవరకూ కలకత్తాలోనే హాస్టల్లో వుండి చదువు కంటిన్యూ చేసాడు. సమీర్ ఆస్ట్రేలియా ప్రాజెక్టుకి వెళ్లిపోతుంటే, నేను సంజయ్‌నీ నా వద్దకు తెచ్చుకుని వుంచుకున్నాను. తండ్రి కూడా దగ్గర లేనందువల్ల వాడూ నా దగ్గరే వుండడానికి ప్రిఫర్ చేసాడు. ఆస్ట్రేలియా నుండి వచ్చాకే, నా డైవోర్స్ పేపర్స్ చూసి, సమీర్ విజిటింగ్ రైట్స్ కోరాడు.

ప్రతిసారీ వచ్చి, హోటల్లో వుండి, వాళ్లని చూసి వెళ్లిపోతాడు. మూణ్ణెల్ల క్రితం బెంగుళూరు విజిటే పరిస్థితి తారుమారు చేసింది. ఇప్పుడేమో రమ్య ఎబార్షన్ వద్దు, పిల్లని కనమంటోంది, ఎలా?

**సమీర్**

కిరణ్మయీ, ఉదయ్, సందీప్, ముగ్గురూ స్విమ్మింగ్ పూల్‌లో ఏవో ఆటలాడుతూ, గోల చేస్తున్నారు.

## తొలి సంతకం

నలుగురిలో ఒంటరిగా
ఒంటరైె నలుగురి ఆలోచన
నలుగురైనా తోడులేనిదే
లంగరేసిన పడవ
అలలపై అడుగు వేయదు!

కొండెక్కి కూచున్న పిల్లమేఘం
నది అద్దంలో ముఖం చూసుకున్నట్టు
నాలోకి నేనే తొంగి చూసుకుంటూ
నన్ను నేను వెతుక్కుంటూ–
ఎక్కడ తడిమినా
దేహవీణలో ఏ తీవె పలకదు,
స్వరం పలకని వీణ
బీరువాకి అలంకారమూ ఓ కళే!

తడారిపోయిన ఎడారి సముద్రం
అలల జాడల్లా
ఇసుక కెరటాల పరుపు
ఓటమి నిష్క్రియత్వంపై
ఎగరేసిన జెండా మాత్రమే!
చుక్కానే లేని గాలికి
గమ్యం, గమనం, గగనమైనట్టే–
తెగిపోతే ఆలోచనకి
జవం జీవం మాయమైనట్టే!
ఆత్మహత్యా పత్రంపై
తొలి సంతకం చేసినట్టే!

–ఈతకోట సుబ్బారావు

మధ్యలో కిరణ్మయి నా దగ్గరకి వచ్చి, 'సమీర్, ఒక కాయిన్ ఇయ్యి", అంది. దానికి నన్ను పేరుతో పిలవమని చెప్పింది నేనే. కూతురు పుడితే అలా పిలిపించుకోవా లని నాకో కోరిక. "లేదే!" అన్నాను వాలెట్ చూసి. పక్కనే ఒక అమెరికన్ కూర్చునున్నాడు, బియర్ తాగుతూ... ఇది అతని దగ్గరకి వెళ్ళి, "డూ యూ హేవ్ ఎ కాయిన్? ఐ విల్ రిటర్న్ ఇట్ ఆఫ్టర్ ప్లే," అంది. వాడు పక్కన పెట్టుకున్న కాయిన్ పర్స్ నుంచి ఒక రూపాయి నాణెం తీసిచ్చాడు. టిప్స్ కోసం పెట్టుకున్నాడో ఏమో! ఈ అమెరికన్లకి ఇండియా వచ్చేసరికి రూపాయీ డాలర్‌లాగే కనపడుతుంది.

కిరణ్మయి కాయిన్ తీసుకుని, 'థేంక్యూ', అని, ఒక్క పరుగులో వెళ్ళి పూల్‌లోకి జంప్ చేసింది. ఉదయ్, సందీప్, ఇద్దరూ వంతులవారీగా ఆ కాయిన్‌ని నీట్లోకి విసురుతున్నారు. కిరణ్మయి గాగల్స్ పెట్టుకుని, నీట్లో మునిగి, వెంటనే దాన్ని వెతికి తీసుకొచ్చేస్తోంది. వెరీ స్మార్ట్ గర్ల్! దాన్ని అప్యాయంగా చూస్తూ, ఆట ఫాలో అవుతున్నాను. ఇంతలో సంజయ్ వచ్చి పక్కన కూచుని తనూ ఆట ఎంజాయ్ చేయడం మొదలెట్టాడు.

"బియర్ తాగుతావా?" అన్నాను. నమ్మలేనట్లు నా వంక చూసాడు.

"ఇరవై ఒకటి అని నేను చెప్తే నమ్ముతారులే. బేరర్‌కి చెప్పిరా ఛిల్డ్ బియర్స్ ఆర్డర్ చేయి. ఆ అమెరికన్ తాగుతున్నాడే, ఆ లేబిల్‌వి", అన్నాను.

హుషారుగా లేచి అటువైపుగా వెళ్తూ, అమెరికన్ టేబిల్ దగ్గర ఆగి, లేబిల్ చూసి, వాడికీ, నాకూ కలిపి ఒక చిరునవ్వు పారేసి, బియర్ సంగతి బేరర్‌కి చెప్పి, మళ్లీ నా దగ్గరకి వచ్చి కూచున్నాడు.

నీ ప్లాన్స్ ఏమిటి సన్?" అన్నాను.

"మమ్మీ చేసే ఫర్మ్‌లోనే ప్రభూ అంకుల్ నాకూ జాబ్ ఆఫర్ చేస్తున్నాడు. ఎకడమిక్స్‌లో ఏముంది డేడీ. త్వరగా సంపాదన మొదలెడితే మమ్మీ ఇంత హైరాన పడనవసరం లేదు. ఐ కెన్ బీ ఆఫ్ సమ్ హెల్ప్ టు హర్", అన్నాడు.

ఎవరు పడమన్నారు హైరానా? అసలిదంతా అంత అవసరమా శార్వరికి? అయినా నేను ఏం చెప్పినా సంజయ్ మనసులోకి ఎక్కించుకోడు. శార్వరి విడిపోయినప్పటి నుంచీ, వాడు ఏ పక్షమూ తీసుకుని మాట్లాడడు. తటస్థంగా ప్రాక్టికల్‌గా వుంటాడు.

"సరే, నీ ఇష్టం," అని ఇంకేదో అనబోతోంటే, సెల్ మోగింది, శార్వరి.

"సమీర్, నీతో కొంచెం మాట్లాడాలి. డ్రైవ్‌కి తీసుకెళ్ళు, పిల్లల్ని సంజయ్‌ని చూసుకోమను," అంది. స్వరంలో ఆత్రుతా, చిన్న కంపనా.

ఇది నేను ఎదురు చూసిన ఘటనే కనుక నాకు పెద్దగా ఆశ్చర్యం కలుగలేదు.

"ఎక్కడ పికప్ చేసుకోను?" అన్నా ప్రశాంతంగా.

"హోటల్‌కి వస్తాను. అక్కడ్నించి వెళ్దాం. జీ.ఎమ్. కారు తీసుకో, డ్రైవరొద్దు" అంది శార్వరి కాస్త గాభరాతో.

"లీవ్ ఇట్ టుమీ," అని కారు ఏర్పాటుకి బయలు దేరుతూంటే బేరరు బియర్లు తెచ్చి బల్ల మీద పెట్టాడు. సంజయ్‌కి అప్పగింతలు చెప్పి, "రెండు బియర్లూ నువ్వే తాగేయి. పిల్లల్ని కనిపెట్టుండు. కిరణ్మయికి మరీ మారాం చేస్తే ఒక సిప్ ఇయ్యి. బాయ్స్ ఎంత అడిగినా ఇవ్వకు, గొడవ చేస్తే రెండు తగల్నియ్యి," అని వాడి భుజం తట్టి బయటకి నడిచాను. అమెరికన్ టేబిల్ దాటుతూంటే, "వెరీ లైవ్‌లీ గర్ల్. యువర్స్?" అన్నాడు. నవ్వి, తలూపాను.

కబ్బన్ పార్కులో మెర్సెడీజ్ మెల్లిగా నడుపుతూ, "సీట్ బెల్ట్ తీసెయ్. పొట్ట నొక్కుకుపోతుంది," అన్నాను. ప్రెగ్నెన్సీల్లో సీట్ బెల్ట్ పెట్టుకోనిచ్చేవాడిని కాదు. పిల్లాడికి ఏమయిపోతుందో అని నాకు భయం.

ఆశ్చర్యంగా నా వంక చూసి, బెల్టు తీసేస్తూ, "నీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి. నిర్ణయం కూడా తీసుకోవాలి," అంది శార్వరి.

## కాడంతే

వాడు గుండె ఆగి
చావలేదు
హృదయం లేక చచ్చాడు
ఎన్నాళ్లికి
మేఘానికి
చిల్లు పడిందో
కళ్ల వెనుక మౌనం
కనురెప్పల శబ్దాన్ని కూడా
వింటుంది
చెట్టును పూజించి
వేళ్లను గమనించని వాడు
కాయలు భారం
అనుకున్న చెట్టు

-ఎ.వి.ఆర్. మూర్తి

"ఎబార్షన్ వద్దు. హేవ్ ది ఛైల్డ్." అన్నాను.

"రమ్య చెప్పేసిందా? దాని నోట్లో నువ్వు గింజ నానదు," అంది కోపంగా. నేనేం మాట్లాడలేదు.

"అయినా సలహా ఎలా ఇస్తున్నావ్? వాట్ రైట్ డూ యూ హేవ్?" అంది.

"ఇటువంటి విషయాల్లో రైట్సేముంటాయి? మనసే వుంటుంది. అది స్పందిస్తుంది," అన్నాను నిశ్చలంగా, రోడ్డుకి సరిగ్గా మధ్యలో కారు పోనిస్తూ.

"ఓహో! నీ మనసంతా కేబరే డాన్సర్ల దగ్గరుండి పోయిందనుకున్నానులే!" అంది శార్వరి.

"ఇన్నేళ్లయినా నీ కోపం అలాగే వుంది శారూ", అనుకున్నాను. బిజినెస్ పర్పస్ కోసం రాజ్ నన్నూ, నా డబ్బునీ వాడుకుని, డాన్సర్స్‌ని తెప్పించి, శార్వరికి అబద్ధం చెప్పాడని ఈ మధ్యే దిలావర్ ద్వారా తెలిసింది. ఏం లాభం? ఇప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. శార్వరి వెనక్కిరాదు. కొత్త జీవితానికీ, కొత్త సంబంధా లకీ అలవాటు పడిపోయింది. ఈ బిజినెస్ ఎసోసి యేట్స్ మా మధ్య స్పర్ధలే ఏర్పరచగలిగారు. తిరిగి మమ్మల్ని దగ్గరకి తీసుకురాగలిగే శక్తి వాళ్లకి లేదు. నేను సంజాయిషీ చెప్పినా, ఇట్ విల్ బీ ఎ షియర్ వేస్ట్ ఆఫ్ టైమ్ అండ్ ఎఫర్ట్!

"స్కాన్‌లో ఆడపిల్లని తెలిసిందిగా. ఫుల్ టర్మ్ కేరీ చేసి, కను. తర్వాత నాకిచ్చేయ్! నేను పెంచుతాను మృణ్మయిని" అన్నాను.

ఆ పేరంటే నాకెంత ఇష్టమో శార్వరికి తెలుసు.

"ఎబార్షన్ వద్దు, సందీప్ డెలివరీలో నీకెంత బ్లడ్ పోయిందో గుర్తుందా? మళ్లీ అటువంటి సిట్యుయేషన్ తెచ్చుకోకు. ఇక్కడే రమ్య దగ్గర వుండు. బాయ్స్‌ని నేను తీసికెళ్తా, కొన్నాళ్లు- చదువుకీ, కొత్త జాబ్‌కీ ఏదీ భంగం రాదు. దిస్ ఈజ్ ది బెస్ట్ వే," అన్నాను. నా స్వరంలో ధృఢత్వం, నిశ్చయం.

"మరి తండ్రి విషయం...?" అంది శార్వరి సంశయంగా.

"బాయ్స్‌కి నేను చెప్తాను. రమ్యకి ఎలాగూ తెలుసు. నువ్వు ఈ కారణంగా నా దగ్గరకి తిరిగి రానక్కర్లేదు. దేర్ ఈజ్ నో కంపల్షన్. మృణ్మయిని నాకిచ్చేసాక, బాయ్స్ నీ దగ్గరకి వచ్చేస్తారు. అప్పుడు నీకూ విజిటింగ్ రైట్స్ వుంటాయి," అన్నాను. నా మాటల్లో హేళన లేదు. మార్దవమే వుంది.

బెల్ట్ సవరించుకుంటూ, శార్వరి మెల్లగా నా తొడ తాకింది. ఎన్నేళ్లకి ఈ స్పర్శానుభూతి?

"వెళ్దాం పద, పిల్లలు నీ కోసం ఎదురు చూస్తూ వుంటారు. కిరణ్మయి అక్కడ ఏం అల్లకల్లోలం చేస్తోందో? దాన్ని స్పాయిల్ చేసినట్లు మృణ్మయిని చేస్తే నేనూరుకోను," అంది మృదువుగా.

శార్వరి కళ్లలోని నీరు కారు విండ్ స్క్రీన్ అద్దాలని మసక చేసేసి, నాకు దారి కనిపించలేదు. రమ్య ఇంట్లో తనని దింపేసి, హోటల్‌కి వెళ్లిపోయాను. పూల్ దగ్గర కిరణ్మయి కాయిన్ నీట్లోకి విసురుతోంది. అమెరికన్ నీట్లోకి దూకి, దాన్ని వెదికి పైకి తీస్తున్నాడు. ఇది వాచ్ దగ్గర పెట్టుకుని టైమింగ్ చూస్తోంది. ఎవరూ చూడకుండా కళ్లు తుడుచుకున్నాను. ఎప్పుడో ఓ రాత్రి వేళ శార్వరికి ఒక విషయం గుర్తుకొస్తుంది. స్కాన్‌లో ఆడ పిల్లన్న సంగతి తేలినట్లు రమ్యకి తెలియదని, నాకెలా తెలిసిందా అని ఆలోచిస్తే అసలు నిజం అర్థమవుతుంది. ప్రభూ శార్వరికి అప్పుడు మాత్రమే. భర్త కాలేదు. పుట్టబోయే బిడ్డకి తండ్రిగా బాధ్యతా వహించలేదు. సమాజం అంటే భయం. అయినా అతని ఫేమిలీ అతనికుంది. ఫేమిలీ లేనిదల్లా నాకే.

ఫోన్లో ప్రభూ నాకీ విషయం చెప్పి పరిష్కారం సూచించమన్న మరుక్షణమే నేను నిర్ణయించుకున్నాను. తండ్రి పాత్ర స్వీకరిద్దామని. ఈవిధంగానైనా శార్వరి మా మధ్య ఏర్పరచిన దూరం సమసిపోయేటట్లు చేయ గలనేమోనని ఆశ!

అయినా, శార్వరీ! ఎన్నేళ్లయినా, నీ చేతి స్పర్శ నా శరీరంలోని ప్రతి భాగానికీ పులకరింత కలుగ జేస్తూనే వుంటుంది, వుంది కూడా. అలాంటిది, ఆ కేబరే డాన్సర్లని నన్ను తాకనిచ్చి, ఆ అనుభూతిని అపవిత్రం చేస్తానని ఎలా అనుకున్నావ్? ■

## ప్రాశ్చరేఖ

పచ్చిక పైటేసుకున్న
పడుచు ప్రకృతివి నీవు
నీలంచు ధవళ పంచెలో
అనంత ఆకాశరాజును నేను
చూడు ప్రియా!
మన బిగి కౌగిలిలో
పాపమా ప్రాశ్చరేఖ
ఊపిరాడక గింజుకుంటుంది

-డా. ఈదూరు సుధాకర్